ఆగస్టు 31నాటికి అల్వాల్ టిమ్స్ పూర్తి

- మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

హైదరాబాద్, జనవరి 7(నమస్తే తెలంగాణ) : అల్వాల్ టిమ్స్ దవాఖాన నిర్మాణం పనులు ఆగస్టు 31నాటికి పూర్తి చేసి ప్రారంభిస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అలాగే డిసెంబర్‌నాటికి సనత్‌నగర్, ఎల్‌బీనగర్ టిమ్స్‌లను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి మంగళవారం అల్వాల్ టిమ్స్ పనుల పురోగతిని పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. దవాఖానల్లో రోగుల సౌకర్యార్థం అల్వాల్ టిమ్స్‌లో ధర్మశాల ఎందుకు నిర్మించడంలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాగార్జునసాగర్ కట్ట బలోపేతంపై దృష్టి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): నాగార్జున సాగర్ కట్ట బలోపేతంపై సర్కారు దృష్టిసారించినట్టు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. డ్యామ్‌పై ఉన్న గుంతల పూడ్చివేతకు తగిన చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లోని జలసౌధలో మంగళవారం నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రూ.664.80 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన నెల్లికల్ ఎత్తిపోతల ఫేస్-1 పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీలోని కాలువలకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అనుముల చెక్‌డ్యాం నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్టు తెలిపారు. సమావేశంలో ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ హమాలీల సమ్మె విరమణ

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లయీస్, జీసీసీ హమాలీలు సమ్మె విరమించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నేత బాల్‌రాజు, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములుతో కూడిన ప్రతినిధి బృందం మంగళవారం ఇరిగేషన్ శాఖ ఆఫీస్‌లో మంత్రి ఉత్తమ్‌తో సమావేశమయ్యారు. హమాలీ రేట్ల పెంపుపై రెండు రోజుల్లో జీవో విడుదల చేస్తామన్నారు.

హమాలీ కార్మికుల అరెస్టు

చివ్వెంల, జనవరి 7 : సివిల్ సప్లయ్ హమాలీలకు పెంచిన రేట్ల జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగిన హమాలీలను పోలీసులు అరెస్టు చేశారు. సూర్యాపేట జిల్లా చివ్వెంలలోని సివిల్ సప్లయ్ గోదాము వద్ద హమాలీ కార్మికులు మంగళవారం సమ్మె చేశారు. సివిల్ సప్లయ్ డీఎం ఎన్ఎస్ ప్రసాద్, డీటీ నాగలక్ష్మి, ఎస్ఐ మహేశ్వర్ వచ్చి ఆందోళన విరమించాలని నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినకపోవడంతో అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ఎమ్మెల్యేల విజ్ఞప్తులనే పట్టించుకోరా?

- మార్కెటింగ్ శాఖ అధికారులపై మంత్రి తుమ్మల ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): 'ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచి వచ్చే విజ్ఞప్తులనే పట్టించుకోరా? ప్రజాప్రతినిధుల వినతులను పరిష్కరించలేనంత బిజీగా ఉన్నారా?' అంటూ మార్కెటింగ్ శాఖ అధికారులపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మార్కెట్ కమిటీల పునర్విభజన కోసం వస్తున్న ప్రతిపాదనను దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంచడంపై ఉన్నతోద్యోగిపై అసహనం వ్యక్తం చేశారు. విజ్ఞప్తులను పరిశీలించి, మూడు రోజుల్లో నివేదిక పంపించాల్సిందిగా మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఉదయ్ కుమార్‌ను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం వ్యవసాయ శాఖపై మంత్రి సమీక్ష నిర్వహించారు.

సాగు చేయని భూములెన్ని..?

రైతుభరోసా పథకం అమలుకు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. వివిధ సాంకేతిక కంపెనీల ప్రతినిధులతో మాట్లాడిన తుమ్మల.. మండలాలు, గ్రామాలు, సర్వే నెంబర్లవారీగా సాగుయోగ్యంకాని భూముల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

పేదల భూములెట్ల గుంజుకుంటరు?

- నోటిఫికేషన్ ఇవ్వకుండా, జీవోలు లేకుండా బెదిరించి సంతకాలు ఎట్ల తీసుకుంటరు?
- మంచిర్యాలలో ఇండస్ట్రియల్ హబ్‌కు పేదల భూములే కావాల్నా?
- పేదల పక్షాన కేసీఆర్, కేటీఆర్ ఉన్నరు
- బెదిరింపులపై న్యాయ పోరాటం చేస్తాం : బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హెచ్చరిక



మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామంలో బాధిత రైతులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల, జనవరి 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'మంచిర్యాల జిల్లాలో ఇండస్ట్రియల్ హబ్ కోసం పేదల భూములు ఎట్ల గుంజుకుంటరు? నోటిఫికేషన్ ఇవ్వకుండా, జీవోలు రాకుండా బెదిరించి సంతకాలు తీసుకోవడం ఏంటీ? దళితులను బెదిరించి భూములు లాక్కుంటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కిందకే వస్తుంది? ఇందుకు కారకులైన నాయకులు, అధికారులపై కేసులు పెట్టాలి' అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం వేంపల్లి, పోచంపాడు, ముల్కల్ల గ్రామాల్లో 276.09 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూములు కోల్పోతున్న బాధిత రైతులను మంగళవారం ఆయన పరామర్శించారు. ముల్కల్లల్లో భూములు కోల్పోయే రైతులతో మాట్లాడి.. ఏం జరిగింది? బెదిరించి సంతకాలు తీసుకున్నది ఎవరు? అనే వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆర్ఎస్పీ మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. మాలలు, మాదిగలు, బీసీలు, అగ్రవర్ణాల్లో ఉండే పేదలు ఎవరైనా కావచ్చు, వాళ్ల భూములను దౌర్జన్యంగా గుంజుకోవడం సరికాదని అన్నారు. వారసత్వంగా వచ్చిన భూములు, గతంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను దౌర్జన్యంగా స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నాయకత్వంలో గుంజుకుంటున్నారని తెలిసి తాను ఇక్కడికి వచ్చినట్టు చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ కంపెనీగా మారిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ మాఫియా ప్రభుత్వాన్ని నడుపుతున్నదని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి ఫోర్త్‌సిటీ పేరిట హైదరాబాద్‌ను, ఫార్మాసిటీ పేరిట లగచర్లను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఇండస్ట్రియల్ పార్కు అని చెప్పి మంచిర్యాల పేదల నోట్లో మట్టి కొడుతున్నారని మండిపడ్డారు. అక్కడ రేవంత్‌రెడ్డి, ఇక్కడ ప్రేమ్‌సాగర్‌రావు ప్రజాప్రతినిధులైనందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, తెలంగాణ ప్రజలు తలలు పట్టుకున్నారని అన్నారు. వీళ్ల పాలన త్వరలోనే అంతమైపోవాలని వేయి దేవుళ్లకు మొక్కుతున్నారని తెలిపారు. ఓవైపు రాహుల్ గాంధీ రాజ్యాంగం పట్టుకుని తిరుగుతుంటే ఇక్కడేమో ప్రేమ్‌సాగర్‌రావు గూండా కంటే ఘోరంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. లగచర్లలో రైతుల భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తే కేసీఆర్ నాయకత్వంలో వీరోచిత పోరాటం చేశామని తెలిపారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాడి వాళ్ల భూములు కాపాడినట్టు చెప్పారు. ఇలాంటి ప్రేమ్‌సాగర్‌రావులను మస్తు మందిని చూశామని, ఎవ్వరికి భయపడేది లేదని రైతులకు భరోసానిచ్చారు. రైతులు పరిహారం తీసుకోకపోతే బలవంతంగా గుంజుకుంటామని బెదిరింపులకు పాల్పడటం వంద శాతం నేరమని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ విషయంలో అవసరమైతే హైకోర్టుకు లేదా సుప్రీం కోర్టుకెళ్తామని, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

మీ లీడర్ల భూముల్లో పెట్టుకోండి..

'పీఎస్ఆర్.. ఇండస్ట్రియల్ హబ్ పెట్టుకోవాలంటే నీ అనుచరులైన కాంగ్రెస్ లీడర్లు సతీశ్ రావు, సంజీవ్‌రావు భూముల్లో పెట్టుకోవాలి. అదే రూ.13 లక్షల పరిహారం వాళ్లకే ఇచ్చి భూములు తీసుకోవాలి. అవసరమైన చిరాన్‌పోర్ట్ ఆస్తులు అమ్మి మీ అనుచరుల భూములు కొనుగోలు చేయండి. ఇవ్వకపోతే గుంజుకోవాలి. పేద రైతుల వెనుక కేసీఆర్, కేటీఆర్ ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని సూచించారు.

10 నుంచి 'ఆరోగ్యశ్రీ' బంద్

నెట్‌వర్క్స్‌హాస్పిటల్స్ రాష్ట్ర అధ్యక్షుడు రాకేశ్ ప్రకటన

వరంగల్ చౌరస్తా, జనవరి 7: ఈనెల పదో తేదీ నుంచి ప్రైవేట్ దవాఖానల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్టు తెలంగాణ నెట్‌వర్క్స్ హాస్పిటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వద్దిరాజు రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది కాలంగా ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కమిటీ ఈ మేరకు తీర్మానం చేసిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ హాస్పిటళ్ల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతుండటంతో సేవల నిలిపివేయక తప్పడం లేదని అన్నారు. ఈనెల పదో తేదీలోగా ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని తెలిపారు. ఇప్పటికే నెట్‌వర్క్స్ హాస్పిటల్స్ కమిటీ సంబంధిత అధికారులకు, ఆరోగ్యశ్రీ సీఈవోకు సమాచారం అందించినట్టు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరనందుకే కక్ష సాధింపు

- మైనార్టీ స్కూల్ భవనం అద్దె బకాయి 40 లక్షలు
- ఫర్నిచర్ తరలింపును అడ్డుకున్న భవన యజమాని
- అరెస్ట్ చేసిన పోలీసులు

అద్దె చెల్లించేంతవరకు ఖాళీ చేయవద్దని నిరసన తెలుపుతున్న యజమాని దేవేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

కృష్ణ కాలనీ, జనవరి 7: అధికార పార్టీకి చెందిన ఓ నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధి తనను కాంగ్రెస్ పార్టీలోకి రమ్మంటే తాను పోనందుకు తనపై కక్ష పెంచుకొని జిల్లా అధికారులతో కలిసి ప్రభుత్వ మైనార్టీ పాఠశాల భవనాన్ని ఖాళీ చేయిస్తున్నారని భవన యాజమాని నాగుల దేవేందర్‌రెడ్డి ఆరోపించారు. తనకు రూ.40 లక్షల వరకు అద్దె రావాలని, అది చెల్లించిన తర్వాతే భవనం ఖాళీ చేయాలని దేవేందర్‌రెడ్డి కుటుంబంతోపాటు నిరసన తెలిపి, పాఠశాల ఫర్నిచర్‌ను వ్యానులో తరలిస్తుండగా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ 2021లో జిల్లా అధికారుల కోరిక మేరకు తన భవనాన్ని ప్రభుత్వ మైనార్టీ పాఠశాలకు అద్దెకు ఇచ్చానని తెలిపారు. 2027 వరకు లీగల్ అగ్రిమెంట్ ఉందని, అయినప్పటికీ అధికార పార్టీకి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులు భవనాన్ని ఖాళీ చేయిస్తున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులకు లేఖ కూడా ఇచ్చానని పేర్కొన్నారు. పూర్తి అద్దె చెల్లించిన తర్వాతనే భవనాన్ని ఖాళీ చేస్తామని డీఎండబ్ల్యూవో శైలజ హామీ కూడా ఇచ్చారని గుర్తుచేశారు. భవనంలోని పాఠశాల ఫర్నిచర్‌ను ఖాళీ చేయకుండా అడ్డుకున్నందుకు యాజమాని దేవేందర్‌రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను భూపాలపల్లి పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, నాగుల దేవేందర్‌రెడ్డి భవనానికి అద్దె చెల్లించాల్సిన మాట వాస్తవమేనని డీఎండబ్ల్యూవో శైలజ తెలిపారు. విడుతల వారీగా చెల్లిస్తామని, ప్రిన్సిపల్ సెక్రటరీకి సమాచారం అందిస్తామని పేర్కొన్నారు.

మార్చి నెలాఖరులోగా మెట్రో డీపీఆర్‌లు

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): ఫ్యూచర్ సిటీ, శామీర్‌పేట, మేడ్చల్ మెట్రో రైలు మార్గాలకు సంబంధించిన డీపీఆర్‌లను మార్చి నెలాఖరులోగా రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వాటిని కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే ఏప్రిల్ నెలాఖరుకు టెండర్లు పిలవాలని స్పష్టం చేశారు. మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంపై మంగళవారం ఆయన తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. శామీర్‌పేట, మేడ్చల్ మెట్రోలు ఒకే చోట ప్రారంభమయ్యేలా చూసుకోవాలని, ఆయా ప్రాంతాల్లో భారీ జంక్షన్ల ఏర్పాటుకు ప్రణాళిక తయారు చేయాలని తెలిపారు. హెచ్‌జీసీఎల్ కింద రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లిఫ్ట్ పునర్‌నిర్మాణ పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నీటి ప్రాజెక్టులకు అడ్డుపడితే ఊరుకోం

- బీఆర్ఎస్ హయాంలో అన్నపూర్ణగా తెలంగాణ
- ఇప్పుడేం అభివృద్ధి జరిగిందో ప్రజలే గ్రహించాలి
- జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి

జనగామ, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : 'నీటి ప్రాజెక్టులకు అడ్డు పడితే ఊరుకునేది లేదు..బీఆర్ఎస్ పభుత్వ హయాంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చింది.. మా పాలనలో ఏం అభివృద్ధి జరిగింది..? ఈ ప్రభుత్వ హయాంలో ఏం అభివృద్ధి జరిగిందో ప్రజలే గ్రహించాలి..?..అధికారం ఉన్నా, లేకున్నా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా' అని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలోని 52 చెరువులకు సాగునీరు అందించే దేవాదుల ప్రాజెక్టు గండిరామారం రిజర్వాయర్ మొదటి లిఫ్ట్ పునర్‌నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టుతో ఎగువ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.104 కోట్లతో మూడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టిందని గుర్తుచేశారు. తరిగొప్పుల మండలంలోని అన్ని గ్రామాలు, తండాలను సస్యశ్యామలంగా మార్చేందుకు అప్పటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి లిఫ్ట్-1 ఇరిగేషన్ కింద రూ. 63.80 కోట్లు మంజూరు చేయించానని చెప్పారు. ఇప్పటికే రెండు లిఫ్ట్‌ల పనులు పూర్తి అయ్యాయని.. చెరువుల్లోకి నీళ్లు రావడంతో 70 టన్నుల చేపలతో మత్స్య సంపద పెరిగిందని గుర్తుచేశారు. లిఫ్ట్-1 పనులు వానకాలం వరకు పూర్తి చేసి నీళ్లు అందిస్తామని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఎమ్మెల్యే పల్లా ప్రారంభించడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులంతా బీఆర్ఎస్, ఎమ్మెల్యే పల్లాకు జీవితాంతం రుణపడి ఉంటామని చెబుతున్నారు.

మరో 3 వేల కోట్ల అప్పు

- ఆర్‌బీఐ నుంచి తాజా రుణం
- వేలంలో పాల్గొని పొందిన రేవంత్ సర్కారు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి సర్కారు మరో రూ.3000 కోట్ల అప్పు తెచ్చింది. ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నుంచి ఈ మొత్తాన్ని సేకరించింది. రూ.1000 కోట్ల విలువైన మూడు బాండ్లను 24 సంవత్సరాలు, 29 సంవత్సరాలు, 30 సంవత్సరాల కాలానికి రాష్ట్ర ఆర్థికశాఖ ఆర్బీఐకి జారీచేసింది. మంగళవారం జరిగిన వేలం లో పాల్గొని రూ.3,000 కోట్ల రుణం పొందింది. ఈ విషయాన్ని ఆర్బీఐ ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని కేంద్ర ప్రభుత్వం 49,255 కోట్లకు విధించగా, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే మూడు త్రైమాసికాల్లో రూ.40,909 కోట్ల రుణం పొందింది. చివరి త్రైమాసికంలో ఆర్బీ ఐ నుంచి మరో రూ.30 వేల కోట్లు సేకరించేందుకు ఇండెంట్ పెట్టింది. మంగళవారం రూ.3000 కోట్లు తీసుకోగా, ఈ నెల 14న రూ.2000 కోట్లు, ఈ నెల 21న రూ.2500 కోట్లు, ఈ నెల 28వ తేదీన మరో రూ.2500 కోట్లు సేకరించనున్నది. అంటే మొత్తం రుణం రూ.70,909 కోట్లకు చేరనున్నది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి అదనంగా రూ.21,654 కోట్లు సేకరించనున్నది.

అగరువనం ఆరగింత!

మొదటిపేజీ తరువాయి...

చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆలేరు మండలంలోని కొలనుపాకలో రియల్ ఎస్టేట్ చేస్తున్నారు. వ్యాపారంలో భాగంగా కొలనుపాకలోనే సర్వే నంబర్ 472, 473లో 40 ఎకరాల్లో అగరు వనం పేరుతో వ్యవసాయం చేస్తున్నారు. ఇందులో పెట్టుబడి కోసం ఓ మార్వాడీ వద్ద సుమారు రూ.4 కోట్ల వరకు వడ్డీకి తెచ్చి ఆ భూములను అతని పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. అయితే రియల్ ఎస్టేట్ లేకపోవడం, ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకావడంతో డబ్బులు తిరిగి చెల్లించలేదు. ఈ నేపథ్యంలో మార్వాడీతో మాట్లాడి తనకు రావాల్సిన వాటాను ఇప్పించాలని సదరు ప్రజాప్రతినిధికి మొర పెట్టుకున్నారు. దీంతో ఇదే అదనుగా భావించిన నేత రంగంలోకి దిగారు. రియల్ ఎస్టేట్ వ్యాపారికి న్యాయం చేయకపోగా మార్వాడీని పిలిపించి తన ప్రతాపం చూపించారు. 40 ఎకరాల్లో 10 ఎకరాలు తనకు ఇవ్వాలని హుకూం జారీచేశారు.

తొలుత ఎకరం భూమి.. 40 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్

మొత్తం భూమిలో 10 ఎకరాలు ఇవ్వాలని ఆదేశించడంతో మార్వాడీకి భూములు ఇవ్వక తప్పలేదు. సదరు మార్వాడీ డిసెంబర్‌లో ఆలేరు తాసీల్దార్ కార్యాలయంలో తన భూమిని సేల్ కమ్ జీపీఏ నుంచి సేల్ డీడ్‌గా మార్చుకున్నారు. ఆ ప్రజాప్రతినిధి 10 ఎకరాల సెటిల్‌మెంట్‌లో భాగంగా తొలుత ఎకరం భూమిని హడావుడిగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. డిసెంబర్ మూడో వారంలో సదరు నేతకు చెందిన 40 అనుచరులకు ఒక్కొక్కరికి ఒక్కో గుంట చొప్పున రిజిస్ట్రేషన్ చేయించినట్టు తెలిసింది. ఆయన అనుచరులు మాత్రం తాము డబ్బులు పెట్టి కొనుగోలు చేశామని బయట చెబుతూ సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక అగరు వనం విషయంలో పోలీసులు కూడా తలదూర్చినట్టు ప్రచారం జరుగుతున్నది. ఆ కీలక ప్రజాప్రతినిధి పోలీసులను రంగలోకి దింపి.. బాధితులను నయానోభయానో తమ దారిలోకి తెచ్చుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భూముల డాటా.. ప్రైవేట్ కంపెనీల చేతికి!

- ఫోరెన్సిక్ ఆడిటింగ్ చేయిస్తామన్న మంత్రి పొంగులేటి
- వీఆర్వోల నియామకంపై కొనసాగుతున్న ఊగిసలాట

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్ నిర్వహణ పేరుతో బీఆర్ఎస్ హయాంలో రైతుల డాటాను ప్రైవేట్ కంపెనీకి అప్పగించారంటూ విమర్శించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అదే పని చేయబోతున్నది. 2014కు ముందు న్న నిషేధిత భూముల జాబితాను అమలుచేస్తామని, ఇందుకు ఫోరెన్సిక్ ఆడిటింగ్ నిర్వహిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. అయితే, ఈ పనిని ప్రభుత్వ సంస్థలతో కాకుండా ప్రైవేట్ సంస్థలతో చేయిస్తామని మంత్రి మంగళవారం వెల్లడించారు. సచివాలయంలో నిర్వహించిన చిట్‌చాట్ లో మంత్రి మాట్లాడుతూ.. ఫోరెన్సిక్ ఆడిటింగ్ బాధ్యతను త్వరలో ప్రైవేట్ సంస్థల కు అప్పగిస్తామని చెప్పారు. అంటే, 2014 కు ముందున్న భూములు, రైతుల సమాచారం, ప్రస్తుతం ధరణిలో ఉన్న రైతులు, భూముల వివరాలన్నీ ప్రైవేట్ కంపెనీల చేతిలో పెడతారన్నమాట. ఆ కంపెనీలు రైతుల భూ ముల వివరాలను కాపీ చేసుకుంటే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వీఆర్వోల నియామకంపై ఊగిసలాట

వీఆర్వోల నియామకంపై ప్రభుత్వం ఊగిసలాట కొనసాగుతున్నది. ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలోనే వీఆర్వోల నియామకంపై చర్చించి ఆమోదిస్తారని అందరూ భావించారు. కాని, వివిధ వర్గాల నుంచి వచ్చిన విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచనలో పడినట్టు సమాచారం. ఫైలు ఆలస్యంగా రావడం వల్ల క్యాబినెట్‌లో చర్చించలేకపోయామంటూ మంత్రి కవర్ చేసే ప్రయత్నం చేశారు. మంగళవారం ఆయన ట్రెసా రెవెన్యూ డైరీ ఆవిష్కరణలో మాట్లాడుతూ.. వచ్చే క్యాబినెట్ సమావేశంలో వీఆర్వోల నియామకంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. వీఆర్వో వ్యవస్థపై ప్రజల్లో సదభిప్రాయం లేకపోవడం, పూర్వ వీఆర్వోలనే మళ్లీ తీసుకొస్తుండటంపై వ్యతిరేకత నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం తర్జనభర్జన పడుతున్నట్టు తెలిసింది. సర్వేయర్లుగా పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలను నియమించడంపై అటు రెవెన్యూ ఉద్యోగుల నుంచి, ఇటు నిరుద్యోగుల నుంచి వ్యతిరేకత వస్తున్నది. న్యాయస్థానంలోనూ సవాలు చేసే అవకాశం ఉండటంతో వీఆర్వోలు, సర్వేయర్ల నియామకాల విషయంలో తాత్సారం చేస్తున్నట్టు సమాచారం.

బరాజ్‌ను బలిపెట్టి.. ఇసుక కొల్లగొట్టి!

మొదటిపేజీ తరువాయి...

జయశంకర్ భూపాలపల్లిలో అన్నారం బరాజ్ దిగువన సర్కారు క్వారీలో ఇసుక తవ్వకాలు

పోయి మొత్తం గేట్లు ఎత్తేసి వందలాది టీఎంసీల నీటిని దిగువకు వదిలేసింది. ఏకంగా గోదావరిని ఎండబెట్టి ఇప్పుడు అందులో ఇసుక వ్యాపారం యథేచ్ఛగా నడిపిస్తున్నది. ప్రభుత్వ ఆధ్వర్యంలో గోదావరిలో ఇసుక తవ్వకాలు ఎప్పటి నుంచో ఉన్నా ప్రస్తుత ప్రభుత్వం వింతగా వ్యవహరిస్తున్నది. ప్రజలకు తాగు, సాగునీటిని అందించాలన్న సోయిని గాలికొదిలి అధికార పార్టీలోని కొందరి ఆర్థిక ప్రయోజనాల కోసం ఇసుక బిజినెస్ కోసం 'గేట్లు' ఎత్తింది. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన అన్నారం బరాజ్‌కు సమీపంలోనే దిగువన ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అన్నారం బరాజ్ దిగువన కొత్తగా మొదలు పెట్టిన ప్రభుత్వ క్వారీ నుంచి రోజూ 200 లారీల్లో 10 వేల టన్నుల ఇసుక రవాణా అవుతున్నది. గోదావరిలో ఇసుక తవ్వి బయట పోసిన తర్వాత లారీల్లో లోడింగ్ చేసే విధానాన్ని పక్కన బెట్టి, బరాజ్‌కు సమీపంలోనే రోజూ వందల లారీల్లో ఇసుక లోడింగ్ చేస్తున్నది. భవిష్యత్తులో బరాజ్‌కు ముప్పు వాటిల్లేలా ఇసుక తవ్వకాలు చేపట్టడం కాంగ్రెస్ కుట్ర ఉన్నదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బరాజ్ పక్క నుంచి తాత్కాలికంగా రోడ్డు వేసి వందల లారీల రాకపోకలు సాగిస్తున్నాయి. బరాజ్ సమీపంలోనే ఇసుక తవ్వడం వల్ల పిల్లర్లకు ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉన్నది. గ్రావిటీ కెనాల్‌పై నుంచి భారీ లోడ్ వాహనాలు రాకపోకలు సాగించొద్దనే సూచనలను పట్టించుకోవడంలేదు. టన్నుల కొద్దీ ఇసుక లోడింగ్ చేసుకుంటున్న వందలాది లారీలు ఈ దారిలోనే పోతున్నాయి.

భారీగా అక్రమాలు

సహజ వనరు ఇసుకను అధికార పార్టీ నేతలు అక్రమ ఆదాయ వనరుగా చేసుకున్నారు. గోదావరిపై ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇసుక క్వారీల్లో భారీగా అక్రమాలు జరుగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్వారీలో ఇసుక తవ్వకాలు, లోడింగ్ కాంట